



కథానిక

పెళ్ళిముందునుంచీ సుమతి వాడిపోయిన మొగంతోనేవుంది. ఈనాడు మరీ విచారంతో కృంగిపోయివుంది. ఆమెకీ దుఃఖం ఇహ ఎప్పటికీ అంతం కానిదిగానే కనిపించింది. అయినా ఎప్పటికప్పుడే ఈ అనంతమైన దుఃఖవాహిని కెక్కడో ఎప్పుడో అంతం అనేది ఉండక తప్పదనే ఊహ ఆమెను ఒకించుక ఊరడిస్తూనే ఉంది.

తలిదండ్రుల కామె ఎప్పుడో చెప్పింది; ఈభర్త తన కిష్టంలేదని అయితే పరిస్థితులు ఆమె, తన కోర్కెను నెరవేర్చుకోడానికి ఎక్కడా వీలుచిక్కే మార్గాన్ని సృష్టించ లేక పోయాయి.

అతనితో ఆమె వివాహం జరుగుతూందని తెలిసిన అమ్మలక్కలు, 'అయ్యోపాపం! చూడవే దాని బ్రతుకెట్లా అయిందో' అంటూంటే, ఆమె వినలేకపోయింది. తన బ్రతుకును గురించి అంత బాధపడుతూన్న ఆ సానుభూతిపరులముందు, ఆమె గట్టిగా ఏడ్చెయ్యాలని అనుకుంది. కాని ఆమె కేడ్పుమాత్రం రాలేదు.

ఆమె ఎన్నోరాత్రుల చిట్టచీకటిలో, నిండు వెన్నెలలో చుక్కల్నిచూస్తూ చంద్రుణ్ణిచూస్తూ కంటితడిపెట్టింది. అయితే ఆమె కంటితడి తుడిచి పారెయ్యడానికి అవి ముందుకు రాలేదు. ఆమె మూగగా ఏడ్చింది. అవీ మూగగా తమ అశక్తత తెలియచేసుకున్నాయి. ఆమె చాల సార్లనుకుంది; ఈ పెళ్ళి జరిగేసమయానికి ఏ దేవతైనా అడ్డుపడి— ఈ పెళ్ళి నాపెయ్యగూడదా అని. అందుకోసమే తను ఎదురు చూస్తూన్నట్లుగా ఆ పెళ్ళిపీటలమీద కూర్చొనివుంది. అయితే అట్లా ఏ దేవతా రాలేదు. పెళ్ళి నిరాటంకముగా జరిగిపోతూనేవుంది.

సుమతి, తను ఏడుస్తూ ఉంటే అంతాసుఖంగా నవ్వుతూన్నట్లు ఊహించుకుంది. పాపమామె తల మరింత భూమిలోనికి దించుకొని పోయింది. కాని, అక్కడనే ఏవేవో నిట్టూర్పులు ఆమె కతి సమీపంలో సన్నసన్నగా వినిపిస్తూనే ఉన్నాయి. అవి తనగురించేనని ఆమె అనుకుంది. అట్లా ఎవ్వరో తనగురించి బాధపడుతున్నారని తాననుకొన గలుగుతూంటే తనమనస్సుకెంత శాంతిగా ఉంటూంది అనుకుంది. కాని ఇంతలోనే ఈలోకంలో పెళ్ళిచేసుకున్న ఏ స్త్రీకూడా తనంత నిర్భాగ్యురాలు కాదని కుమిలిపోయింది. అందులో ఈ రోజుల్లో తన కిలాంటి దుర్గతి పట్టడం - ఎంత అవమాన కరమైన విషయం! పోనీ తనుకూడ మనసార ఒక యువకుణ్ణి ప్రేమించిందికదా! కాని... ఏమిటో...అతను తనకన్నా బలహీనుడు. బ్రతుకు తెరువు చూసుకోలేని అర్భకుడు! అతను తనవైపు చూసి ఏడుస్తూఉంటే అలా కళ్ళనీళ్ళు గ్రుక్కుతూ ఉంటే—తనే అతనితో లేచి ఎక్కడికో ఈ ఆకాసం కొసలకు పారిపోవాలని అనుకుంటూంది. కాని ఏమిటో అట్లాఏమీ జరగడంలేదు. ఆకసంకొసలకు ఎలా తేలిగ్గా తేలిపోవాలో తేలడమూలేదు. మనసు పనిచేస్తూన్నట్లు పనులు జరగడంలేదు. నిజంగా ఆ అనసూయ తనను ఎంత వెక్కిరిస్తూందో! ఇష్టమైన భర్తకోసం ఎన్ని అడ్డంకుల్ని అవలీలగా దాటేసింది! ఎంత సాహసవంతురాలు! ధైర్యంలేని

రంధి సోమరాజు

వాళ్ళపైకి బాధలిట్లాగే ముసురుకుంటాయి కాబోలు...సుమతి క్షణంలో ఆ పెళ్ళిపీటల మీంచి, లేచి పారిపోవాలనిపించింది. కాని ఆమె మీద ఎన్ని కళ్ళునిలచి ఉన్నాయో...ఎన్ని ఉరి త్రాళ్ళు జారుగా బిగిసిపోడానికి సిద్ధంగా ఉన్నాయో ... ఇది ఎంత అప్రతిష్ఠ! ఆమెతల్లి నూతిలో పడిపోదూ...ఆమెతండ్రి తల బాదుకొని చనిపోడూ...ప్రేమకోసం ఆమె పారిపోతుంది... పరువుకోసం ఆమె తలిదండ్రులు చచ్చిపోతారు!..

ఎందుకనో ఆమెకు ఆమెమీదనే అనుమానం వేసింది. నిజంగా తను తన తలిదండ్రులు ప్రాణాలు పోగొట్టుకుంటారేమోనన్న భయంతోనే పారిపోవడం మానేసిందా...? అబ్బే లేదు. తనే... ఇక్కడనుంచి ముందుకు ఒక్క అడుగువేసే స్థితిలో లేదు. అసలు తనే లోకానికి భయపడిపోయింది. ఇతరులకోసం తను త్యాగంచెయ్యడం అటుంచి, తనకోసం తనే ఏమీ చేసుకోలేక పోతూంది. లోకం తనకింత బలహీనత నెట్లా కట్టబెట్టింది? పిచ్చిలోకం! తనమీద బలవంతంగా రుద్దిన ఆ బలహీనతేమిటి? అసలు అట్లాంటి భయాలనది ఎంత మందిమీద పులమలేదు? అయితే వాళ్ళట్లా దాని అదుపాజ్ఞలకు లొంగిపోయారా? తనే ఎందుకు లొంగిపోవాలి? ఆలోచిస్తూ ఆలోచిస్తూ తను మళ్ళీ మొదటికే వస్తూందేమిటి? మొదలూ లేదు; చివరా లేదు. తను ఇక్కడనుంచి పారిపోవడం మాత్రం ఉత్తదే! ఒకవేళ సూర్యం పిచ్చివాడైపోయి ఇక్కడకొచ్చి ఇంకెవ్వరికీ నన్ను పెళ్ళిచేసుకొనే హక్కులేదని విలపిస్తేనో...అమ్మో! ఇంతమందిలో ...అబ్బే!...అదేమంత బాగుండదు. వీళ్ళంతా ఏమనుకుంటారు...ఈ అమ్మాయి గుణం మంచిది కాదని అనుకుంటే?...ఛీఛీ...నిజంగా సూర్యం వస్తాడేమో...ఒకవేళ సూర్యం వస్తే తనేం చెయ్యాలి? సూర్యం నావాడు...సూర్యాన్నే పెళ్ళాడుతానంటే...అవును ... అలా అనేస్తే ఎంతో చక్కగా ఉంటుంది. వీళ్ళంతా యెందు కొప్పుకోరు? ఇది ఎంతో బాగుంది. సూర్యం ఇప్పుడు ఇక్కడికొస్తే ఎంత బాగుంటుంది? మరి వీళ్ళు సూర్యాన్ని పెళ్ళిచేసుకొని ఏమి బావుకుంటావే అంటే...నాన్నకూడ అలాగే అంటున్నాడుగా...వీళ్ళూ అదే అంటారు. అయితే వాళ్ళలా అంటే నేనుమాత్రం ఊరుకోను. మేం ఎలా బ్రతికితే మీకేం అంటాను. ఔను మేం ఎలా చస్తే వీళ్ళకెందుకు? అబ్బ! తల తిరిగిపోతూంది. ఈ పెళ్ళి నాకొద్దు...అమ్మా నాకీపెళ్ళి వద్దే...ఆమె బావురుమని ఏడ్వబోయింది. కాని ఆ దుఃఖం ఆమె కంఠంలోనే సుడిగుండాలు తిరిగి ఆమె కన్నులలోంచి ధారగా ప్రవహించింది.

పెళ్ళికొడుకు మంగళసూత్రం కడుతూండగా అతని చేతిపైన కన్నీళ్లు పడటం జరిగింది. అంతే... పెళ్ళికూతురు స్పృహతప్పి పడిపోయింది! 'అయ్యో...అయ్యో' అన్నారంతా. వెంటనే ఆమె మొగంమీద నీళ్లు చల్లారు. ఆమె స్పృహ తెచ్చుకొని లోకాన్ని లోకంగా అర్థం చేసుకునే స్థితికి వచ్చేటప్పటికి పెళ్ళి అయిపోయిందనిపించారు. జరుగవలసిన తతంగాలన్నీ జరుగకపోయినా అవన్నీ జరిగినట్లే భావించారు.

పెళ్ళికొడుకు తరఫువారు పెళ్ళికూతురికి మూర్ఛ రోగం అదీ లేదుకదా అనే అనుమానంలో చిక్కుకొని కాస్సేపు గించుకున్నారు. సుమతి ఈడు పిల్లలంతా, ఆమె బంధువులు, నెచ్చెలులతోసహా, 'మా సుమతికెంత కష్టంవచ్చింది. దాని కిలాంటి రాత రాసుంది కాబోలు!' అని మదిలో కలత జెందారు. పెళ్ళికొడుకుతరఫు సుమతి వయసు అమ్మాయిలంతా, 'ఈ ఏడుపు పిల్లకి ఈ మొగుడు అనలేదు కాబోలు!' అని చీదరించుకున్నారు. పెళ్ళికూతురు తల్లి, కూతురు అవస్థచూసి కంట తడిపెట్టుకుంది. తండ్రి, ఇంతమందిలో తన కూతురు తల కొట్టేసిన పని చేసిందని లోలోన కుళ్ళిపోయాడు. ఇదంతా చూసి, ఎవరో ఇదేదో బలవంతం పెళ్ళిలా ఉందే...అని పుసుక్కున అనేశారు. అయితే ఈ మాటను అక్కడివాళ్ళు చాల తేలిగ్గా తీసిపారేశారు. ఆ మాటను విననట్టుగానే ఊరుకున్నారు. అలా ఊరుకోవడమే కాకుండా, 'ఆ అ. ఇదంతా ఈ రెండురోజులే...ఆ తరువాత వాళ్లే కలిసిపోతారు' అని ఎంతో తృప్తిని ప్రకటించారు. 'చిన్నపిల్లమ్మా తెలియనితనం' అని ఎవ్వరో పెళ్ళికూతురు మీద విపరీతమైన సానుభూతిని కనబరచారు. 'ఆ మూడు ముళ్ళు పడిపోయాయా ఇక వాళ్ళే ఈడుకుపోతారు' అంటూ ఓ ముసలమ్మ

దీర్ఘంతీసింది. పాపం సుమతి ఒళ్ళు మళ్ళీ స్పృహ తప్పి భూమిమైకి ఒరిగిపోయింది.

సుమతి ఇప్పుడు అత్తవారింటిదగ్గర ఉంది. ఆ ఇల్లు ఓ మోస్తరుగా పెద్దదనే అనాలి. గదులన్నీ విశాలంగా చూడముచ్చటగా ఉన్నాయి. ఒక గదిలోనుంచి మరొక గదిలోకి మార్గాలు వుండటంవల్ల, మాష్టరుగారి పొడగిట్టని సుమతికి, ఆయనను తప్పించుక తిరగడానికి అవి ఎంతో ఉపకరించాయనే చెప్పాలి. ఆ ఇంటి వెనుక దొడ్డిలో నీటుగా పూలమొక్కలు తలలెత్తుకొని కాలేజీకి పోయే అమ్మాయిల్లా కలకల్లాడుతూ ఉన్నాయి. భూదేవి కడుపుల్లోని సారాన్ని పుణికి పుచ్చుకొని విజ్ఞానపు రంగుల్నీ సువాసనల వెల్లువల్నీ, అందాల దొంతర్లనీ సంతరించుకొని 'మేం ఎంత గొప్పవారమో చూసుకో ఓ గాలి బావా' అని కేరింతాలు కొడుతూన్న ఆ పూలమొక్కల్ని ఎంతో తమాషాగా కౌగలించుకొని గాలి—హాయి హాయిగా గంతులేస్తూ ఆ ఇంటి గదుల్లోంచి బయటకు పోతుంది. పోతూపోతూ సుమతిని చూసే పోతుంది. పాపం సుమతి చూడనట్టే ఊరుకుంటుంది. అయినా ఆ సుకుమార శీతలవాయు కుమారునికి ఏమాత్రమూ కోపము రాదు. మరి సుమతికి ఏడుపు రాకుండానూ పోదు!

సుమతి ఇక్కడకు వచ్చిననాడు ఎవ్వరితోనూ మాట్లాడలేదు. 'ఘూగపిల్లలా అలా ఉంటుందేమమ్మా' అంటూ చాలామంది మూతి ముడిచారు. 'మా మాష్టరుగార్కి దొరగ్గా దొరగ్గా ఇలాంటి పిల్ల దొరికిందేమిటి? ఆ లక్ష్మిముందు ఈ పిల్ల ఎందుకూ కొరగాదు. అబ్బో...ఆ లక్ష్మి ఇంట్లో తిరుగుతూవుంటే ఎంతకళగా ఉండేది!' అన్నారు; లేని ఆ లక్ష్మి వాళ్ళకేదో ఒరగబెట్టినట్లు, ఇప్పుడున్న సుమతి ఇక ఎప్పుడూ వాళ్ళకేమీ చిదిమే రకం కానట్టూ.

ఆ ఇంట్లో ఇంకెవ్వరూ లేకపోవడంవల్ల సుమతికేమీ పాలుపోవడంలేదు. ఇంకొకరెవరైనా ఉండడం ఆమె కెంతగానో అవసరమైనట్లు తోచింది. అయితే అది ఎట్లాసాగుతుంది? మాష్టరుగారితో ఆమె మాట్లాడదు. అట్లాగని అతను మాత్రం సుమతిని పలుకరిస్తున్నాడా అంటే... అబ్బే...అదీలేదు. అతను మాట్లాడకపోవడం సుమతికి ఊరిపోస్తూన్నట్లుగా ఉంది. తనతో ఆయన ఏ దృష్టితో మాట్లాడటంలేదో ఆమెకు అప్పుడప్పుడు తెలుసుకోవాలని ఉండేది. అయినా 'వారు మాట్లాడకపోవడమే బాగుంది' అని ఊరుకొనేది.

మొదట కొన్నిరోజులు ఇంట్లో ఏవేవికావాలో దాసీమనిషికే చెప్పేది. ఆ తరువాత ఆమె కావలసినవన్నీ ఓ చీటీవ్రాసి మాష్టరుగారి టేబిలుమీద పెట్టేది. క్రమేణా ఆమెకదే అలవాటయింది.

మొదట్లో ఒకే గదిలో వారిద్దరూ విడివిడిగా పడుకొనేవారు. అయితే అతనివైపు ఆమె చూసేది కాదు. ఆమెవైపు అతను చూసినా చూడనట్లే ఉండేవాడు. ఆమెకు నిద్రవచ్చేదికాదు. నిద్రవచ్చే సమయాన ఆ మాష్టరుగారు గుర్తుకొచ్చి భయం భయంగా నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయేది.

ఓ రాత్రి సుమతికి మాష్టరుగారి మొదటిభార్య లక్ష్మి గుర్తుకొచ్చింది. ఆ లక్ష్మి ఆయనని ఎంత సుఖపెట్టేదో...వాళ్ళిద్దరూ ఎట్లా కాపురం చేసేవారో...అన్న ఆలోచన, ఆమె ఎదలో కల్లోలంగా విహరించింది. విపరీతమైన భయంతో ఆమె పిచ్చిగా, 'ఔను ఆయన ఒంటరి దాన్నిచేసి తనను బలవంతంచేస్తే...? అతనట్లాంటివాడైతే ... ఇక తనేమి చేయగలదు...? అక్కడనుంచి ఎట్లా తప్పించుక పారిపోగలదు? ఔను...ఎలా పారిపోగలదు? ఎలా...? ఆమె గజగజ వణికింది. ఈ ఊహ ఆమె నాభి భాగంలోంచి కెవ్వున ఉవ్వెత్తుగా విజృంభించి, ఎవ్వరో కుత్తుక అకస్మాత్తుగా పిసికేస్తూంటే మరిపైకి పోలేక అక్కడనే స్తంభించిపోయి గిజగిజ తన్నుకుంటూన్నట్లు కొట్టుకుంది.

ఈ సంసారాన్ని చూసి ఆ వీధిలోని అమ్మలక్కలందరూ చాల మెచ్చుకున్నారు. మొనగాడంటే మాష్టరుగారే మొనగాడని వాళ్ళంతా మెచ్చుకున్నారు. 'ఎంత పొందిక అయిన పిల్లను చేపట్టాడు...' అని సంతోషించారు.

సుమతిలో విచారం దట్టంగా క్రమ్ముకుంటూనే ఉంది. ఈ ఊబిలోంచి బయటపడే మార్గం ఒక్క చావు మినహాయించి మరేముందో...ఎంతాలోచించినా ఆమెకు అంతు చిక్కడంలేదు.

కూరగాయలు తెచ్చే జీతగాడుగా మాష్టరుగారు, వంటలువండే వంటలక్కగా సుమతి, ఆ

ఇంట్లో వెలిగిస్తూన్న కాపురాన్ని చూసి ఆ పేట పేటంతా 'ఎంత చక్కని సంసారం' అని, అనందించకుండా ఉండలేకపోయింది.

మాష్టరుగారు ఇట్లా తనతో మాట్లాడక పోవడం సుమతికి ఓ రోజున చాల బాధకలిగింది. ఆయన, వెలివేసినట్లు తనతో మాట్లాడక పోవడం ఆమెకు చిన్నతనమయింది. ఈ దృష్టి ఆయన ఆయన కుండడం చాల అన్యాయమనిపించింది. కాని ఈ దృష్టి ఆయన కెందు కుండగూడదో ఆమె స్పష్టపరచు కొనలేకపోయింది. తను ఆయన గారి మొగాన్ని చూడటానికే ఇచ్ఛగించడంలేదు. అట్లాంటిది తనతో ఆయనెట్లా మాట్లాడగలడు?

ఒకరోజున మాష్టరుగారు తలదువ్వుకుంటూ ఉండగా అద్దంలోని అతని మొఖాన్ని ఆమె అకస్మాత్తుగా చూడటం సంభవించింది. 'ఏమిటి ఆ ముఖంలో ముసలితనంలేదే...ముఖం వికారంగా లేదే...'అని ఆమె ఆశ్చర్యపోయింది. కాని వెను వెంటనే ఆమె, 'ఆ ముఖమెలాఉంటే నాకేం' అని తనుతనే సమాధానపరచుకుంది. 'ఆ....అ....అది అద్దంచేసిన దగా!'అని ఆమెలో ఎవ్వరో మళ్ళీ ఈర్ష్యగా ఉటంకించారు. ఆమె, 'ఒకసారి ఆయనను సరిగ్గా చూస్తే'అనుకుంది. కాని, 'ఇదేంపని... ఇదేంపని...'అని తనను తనే తిట్టుకుంది. ఆవేళ ఆమె ఏ పనీ సరిగ్గా చేయలేకపోయింది. ఆనాటి నుంచీ ఆమెకీ విషయాన్ని గురించిన ఆలోచనలు అధికమైపోవడం మొదలుపెట్టాయి. ఈ తలంపులు హెచ్చయ్యేకొద్దీ మరోకవిషయమేదో అతిముఖ్యమైనది జారవిడిచేస్తూన్నట్లుగా ఆమె మథనపడేది. అప్పటినుంచీ ఆయన ముఖం ఏ రూపేణా తనకు తటస్థపడకుండా ఉండేందుకు ఆమె మరింత జాగ్రత పడజొచ్చింది.

ఆమె కూరల్లో ఉప్పువెయ్యడం మరచిపోవడమో, కారం జాస్తిగా పరాకున వేసేస్తూవుండడమో చేస్తునేవుంది. అయితే ఆమె ఎలా వండినప్పటికీ అతను అన్నం విడిచిపెట్టెయ్యడంగాని, కూరలు కెలికి వదిలెయ్యడంగాని, ఎప్పుడూ చెయ్యలేదు అయినా సుమతి తన మనసులో కుమిలిపోయేది. వారిని ఎంతబాధ పెడుతున్నాను ఎంత బాధపెడుతున్నాను అని ఎదలో తెగనలిగిపోయేది. ఆడదాన్నై ఉండీ, దగ్గర ఉండి ఏమికావాలో కనుక్కుంటూ ఒకటికి పదింతలు వడ్డించి పుష్టిగా తినేట్లుచేయవలసిందిపోయి,' ఇలా మారుమూలను నిలబడి ఉండడం ఎంత నీచమైన పని...ఎంత నీచమైన పని...అని ఎంతగానో నిట్టూర్చేది.

ఏయే సరుకులుకావాలో వ్రాసిన చీటీ టేబిలు మీద పెడుతూండగా ఓరోజున సుమతి ఆ టేబిలు మీద ఓ అందమైన చీర, జాకెట్టుగుడ్డా ఉండడం చూసింది. వాటిని చూడగానే ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. వాటిని స్వీకరించాలా, స్వీకరించగూడదా అని ఆమె తబ్బిబ్బయింది. ఛీ-ఛీ, నేనెందుకు తీసుకోవాలి అనుకుంది. అవును వాటిని పుచ్చుకోకుండానే ఉండాలి అని గుండెను గట్టి పరచుకోబోయింది. కాని వెనువెంటనే 'ఎందుకు పుచ్చుకోవ్...? ఏం...? అలాంటిదానివిక్కడ ఎందుకు వంటచేస్తున్నావ్...? ఇక్కడ ఎందుకు అన్నం తింటున్నావ్...?' అని సుమతినెవ్వరో ఖచ్చితంగా నిలేసి అడిగారు. అతనికి వంట వండటానికి ఇష్టపడిన దానవు, అతని అన్నం తినడానికి అయిష్టం లేనిదానవు, అతను ఇచ్చిన చీరను పుచ్చుకోడానికి ఏ మొచ్చింది?' అని ఆమె మనసు నిశతంగా విమర్శించింది. సుమతి నీరసించుకపోయింది. 'అరే...ఇదేమిటి...ఇదేమిటి... నే నీ పనుల కిష్టపడ్డానా?...లేదు...లేదు...' అని ఆమె ఏడ్వబోయింది. కాని ఆమె కేడ్పురాలేదు.

ఆ చీర నేమిచెయ్యాలో అర్థంకాలేదు. తను వడ్డించిన వంటకాలు ఆయన తింటున్నాడు కాబట్టి ఆయన తెచ్చిన చీర, తను కట్టుకోకపోతే ఏమీ బాగుండదన్నమాట! అయితే వారు తనకు తృప్తిని కలిగించటానికే తింటున్నారా...వారి తృప్తికోసం తనూ ఆ చీర కట్టుకోవాలా...ఏమిటది...ఏమిటది...అసలు ఈ చీర తనకెందుకు నచ్చింది? కాని ఆయన తెచ్చినవేవీ తనకు నచ్చగూడదనే భావము తన కెందుకుంటోంది... 'ఓహో సుమతీ నీవు ఇలా మారిపోతున్నా వేమిటి?'

మాష్టరుగారు లేనప్పుడు అల్లం ఉందమ్మా అంటూవచ్చిన పుల్లయ్యగారి భార్య, ఆ టేబిలు మీద ఉన్న చీరచూసి, 'ఎంతమ్మా ఈ చీర? చాలా బాగుంది'అంది. ఈమాట వినగానే సుమతి ఎంతో ఖంగారుపడింది. ఇట్లా ఈ చీర పీకలమీదికి తెచ్చిందేమిటి అని ఆమె కలవరపడింది. అప్పుడప్పుడు

పొరుగిళ్ళ ఆడవాళ్లు వేసే చిక్కు ప్రశ్నలకు ఎట్లాగో అట్లాగ సమాధానాలు చాలముక్తసరిగా ఆ సమయానికి తగ్గట్టుగా చెప్పేస్తూ ఉండేది. ఆ సమాధానాలన్నీ చాలమట్టుకు తమ కాపురం హాయిగా నిక్షేపంలా ఉందనే అర్థాలతోనే అంతమయ్యేది. తనకు తెలియకుండానే తను ఇట్లా ఎందువల్ల మాట్లాడేస్తూందో సుమతికోపట్టాన అంతుచిక్కలేదు. ఇష్టంలేకపోయినా, తను ఎందువల్ల ఈ కాపురానికి ఇష్టపడ్డట్టు నటించడమో ఇందులో ఏ పరమార్థం దాగి ఉందో ఆమెకు గ్రాహ్యం కాలేదు.

'చాలా బాగుంది సుమతీ! ఎంతకుకొన్నారేమిటి' అంది మళ్ళీ ఆ వచ్చిన వనితారత్నం; చీరపొరలు అటూఇటూ త్రిప్పుతూ. సుమతి ఈసారి ఈ అగ్నిపరీక్షలోంచి తప్పించుకొనే మార్గంలేక, 'మీరు చెప్పండీ! ఎంతకు కొనవచ్చో?' అంది. ఈ మాటలు ఆమె శ్రవణేంద్రియాలకే ఎంతో వికారంగా అసహ్యంగా వినిపించాయి. కాని ఏమిచేస్తుంది? ఆ వచ్చినామె పకాపకా నవ్వి, 'బలే నంగనాచివే అమ్మాయ్! నా అంచనాకేంగాని- చెప్పూ' అంది; కొంచెం లాలనగా. సుమతికి చాల కష్టదశవచ్చింది. అయినా ఆమె నిల్దొక్కుకొని లేని నవ్వును గ్రుమ్మరించుకొని, 'సరిగ్గా నేనూ ఇందాక మీలాగే అడిగానండి... కాని, నాకేం తెలుస్తుందండీ, ఈచీర ఖరీదెంత ఉంటుందో' అంది. దానితో ఆ వచ్చినామె, 'సరిసరి. దీని ఖరీదు ఇంకా మీ ఆలుమగల వేళాకోళాలమధ్యనే నలుగుతూందన్నమాట! ఈ రాత్రికి దీని ఖరీదెంతో అంతుచిక్కుతుందిలే' అంటూ అక్కడనుంచి ముసిముసినవ్వులతో వెళ్ళిపోయింది. అయితే ఆమె అల్లంమాత్రంమరచిపోయి వెళ్ళలేదు. పాపం సుమతి జరువుగా మంచంమీద కూలిపోయింది. 'తనకెంత బలహీనతేమిటి? తనకిష్టం లేని మాష్టరుగారిని ఎంతో ప్రేమిస్తూన్నట్లు ఈ లోకాన్ని తను మభ్యపెట్టడమేమిటి? ఈ మోసం ఏమిటి? ఈ ఆత్మవంచనేమిటి?' ఆమె తలలో భయంకరమైన జ్వాలలు లేచి ఆకాశానికి అంటుకున్నాయి. అప్పుడే జాలిగా చల్లని కన్నులు తెరచి ఆమెవైపు ఎక్కడలేని బాధతో చూస్తూన్న సూర్యం ఆమె కళ్ళముందు నిలిచాడు. 'సుమతీ! నన్ను మరచిపోతున్నావా? నీకోసం నేను ఇక్కడ ఒంటరిగా ఎంత దుఃఖిస్తున్నానో నీకేం తెలుసు? సుమతీ! నీకోసం నేనిలాగే క్రుంగి కృశించిపోతాను' అన్నాడు. సుమతికీ మాట కాస్త చల్లదనాన్ని కూర్చింది. అతను తనకోసం ఒంటరిగా అలా కుమిలిపోతున్నాడన్న విషయం తనకెందుకనో తృప్తిగా ఉండడం—ఆమెకే ఆశ్చర్యంవేసింది. 'ఇదేమిటి సుమతీ! నీవు సూర్యాన్ని ప్రేమిస్తున్నావా...? సూర్యం నీకోసం పడే ఆరాటాన్ని ప్రేమిస్తున్నావా? ఇందులో ఏది నిజం? ఏమిటి సుమతీ!' ఈదెబ్బకు సుమతి ఏమాత్రం తట్టుకోలేకపోయింది. ఆమెలో ఏదో భరించనలవికాని భావం ఆవేశించి, ఆమె ముఖంలోనికి దుస్సహమైన ప్రేతకళ నీడ్చుకవచ్చింది. ఆమె కనులు, పిచ్చిచూపులు నించుకొని శూన్యంలో ఏకమైపోయాయి.

ఇప్పటికొచ్చి సుమతి మాష్టరుగారి కంఠాన్నే వినలేదు. ఆయన ఎవరితో మాట్లాడుతూ ఉన్నా ఏదో రహస్యం చెవిలో ఊదుతున్నట్లుగానే ఆమె గుర్తించేది. ఒక్కొక్కప్పుడు ఆయనది కీచుకంఠమేమో అని అనుకునేది. అందువల్లనే ఆయన తన కంఠాన్ని తనకు వినిపించకుండా దాచుకుంటాడేమో అనుకుంది. అయినా తనకెందుకూ ఆయనగారి గొంతుక గొడవ? ఆయన కంఠం శ్రావ్యంగా ఉంటే తనకేం, లేకపోతే తనకేం. కాని ఆ కంఠం మధురంగాఉండగూడదని తన గుండెల్లో ఎవ్వరో పెద్దగొడవచేస్తున్నట్లుగా ఉందేమిటి? ఔను అలా అనిపిస్తూందేమిటి అనుకుంది సుమతి.

అబ్బ! ఎంత చక్కగా తెల్లవారిందనీ ఆవేళ! అయినా సుమతిమాత్రం అదోలానే ఉంది. తల్లి వచ్చి పుట్టింటికి రమ్మంటే రానంది. తండ్రి రెండు రోజులుండి పోవే... అని బ్రతిమాలినా అక్కడనుంచి కదలనంది. అక్కడ సూర్యం ఉన్నాడని తెలిసికూడ తను ఎందుకని అలా అన్నదో... సూర్యం ఎట్లా ఉన్నాడో... ఈ విషయం అమ్మనడిగితే! పోనీ ఎట్లా ఉన్నాడో అడిగి తెలుసుకునే బదులు, అక్కడకుపోయి ఒకసారి చూస్తేనో ...ఊహు. ఇంక అతని మొగం చూడొద్దు... చూడొద్దు...చూస్తే...చూస్తే... ఎటుపోయి ఏమి వస్తుందో...సుమతి పిరికి గుండెల్లో భయం విపరీతంగా ఆక్రమించింది. వెంటనే ఆమె మనసు, 'సుమతీ...నీకు సూర్యాన్ని నిజంగా చూడాలనే

లేదు. అంతేకదూ...' అంది. 'అదేమిటి ఎందుకు లేదు? అతన్ని చూడాలని ఎందుకులేదు' అంది సుమతి. 'ఔను నీకు సూర్యాన్ని చూడాలనే ఉంది. కాని...కాని నీవు సూర్యాన్ని మరచిపోడానికే ప్రయత్నిస్తున్నావు సుమతీ' సుమతి రెండు చేతులతో మొగం కప్పుకొని, అక్కడనుంచి గబగబా పారిపోబోయింది. కాని ఎక్కడికి పోగలదు?

కాలం కొందరికి గబగబా కామెట్ మీద కూర్చొని ఎగిరి వెళ్ళిపోతూన్నట్లూ కొందరికి వాళ్ళున్నచోటే గుండె ఆగి చచ్చిపోయినట్లూ అనిపించింది. కాని కాలంమాత్రం వాళ్ళను చూసి నవ్వుకుంది.

'సుమతీ...సుమతీ' అని సుమతి నెవ్వరో తియ్యగా పిలిచారు. వంటగదే సర్వస్వమూ ఐన సుమతి, 'ఇదేమిటి నన్ను పిలిచేవాళ్ళెవ్వరు? అది మగవాళ్ళ కంఠంలాగుందే. నన్ను పిలిచే మగవాళ్ళెవ్వరు?' అనుకుంటూ గుమ్మంలోంచి, వీధి గది లోనికి తొంగిచూసింది. అక్కడ ఎవ్వరో క్రొత్త వాళ్ళు చాలమంది ఉన్నారు. 'మాష్టరుగారు ఎక్కడకు వెళ్ళారో ఈ వేళకు ఈ గదిలోనే ఉండాలే. అరే ఈయనెవ్వరు? ఎప్పుడో ఎక్కడో చూసినట్లుందే' అనుకుంటూ సుమతి 'ఎవరండీ మీరు' అనబోయింది. కాని ఈ మాట ఆమె లోంచి బయట పడకముందే. 'సుమతీ ఈవిడ మా అక్కయ్య మా పెత్తల్లికూతురు వీళ్లు ఆమె పిల్లలు' అన్న గొంతుక వినిపించింది. 'ఎంత మధురంగాఉంది ఆ కంఠం! ఈయనేనా మాష్టరుగారు! ఎంత బాగున్నారు. ఇంకానయం పైకి ఎవరండీ మీరు అన్నానుగాను. ఇంకానయం' అని సుమతి సతమతమైపోతూంటే ఆమె ఎదలోని ఎద 'సుమతీ ఇంత మంచివారు నీకు భర్తగా దొరకటం—ఎంత అదృష్టం అబ్బ! ఆ నిర్మలమైన పవిత్రమైన నేత్రాలు చూశావా' అంది. సుమతి కళ్ళు ఆ వచ్చిన వాళ్ళను సరిగ్గా చూడలేకపోయాయి. అవి తమ ముందు తెరలు దించుకొని నిలుచున్నాయి.

'అదేమిటే అమ్మాయ్. అదేమిటి నీ కళ్లల్లో నీళ్ళు నిలిచాయేం?' అంటూ మాష్టరుగారి అక్క, సుమతిదగ్గరకు వచ్చింది. సుమతి కంగారుగా తలను ప్రక్కకు త్రిప్పుకొని, చీర కొంగుతో కళ్లను అద్దుకుంటూ, 'అబ్బే ఏమీలేదండీ. ఈలోపల కూర్చుందాం రండి' అంటూ ఆమెను లోని గది లోనికి తీసుకొనిపోయింది. ఆమెకు ఆమె పిల్లలకు ఏమే సదుపాయాలు చేయాలో—అందుకు త్వరత్వరగా ఉపక్రమించింది. ఆమెగారున్న రెణ్ణాళ్ళూ సుమతి ముళ్ళమీద ఉన్నట్లుగానే ఉంది. ఆమె వెళ్ళిపోతూ తమ్ముడితో, 'ఇదేం దాంపత్యంరా. మీరేమయిగ్గా పోట్లాడుకున్నారా ఏమిటి? ఒక మాటాలేదు మంతీలేదు. బాగుంది' అని కాస్త ఆగి ఎంతో బాధతో, 'అదెలాగూ లక్ష్మిరా... అది వెళ్ళిపోయింది. అంతే మరి నీ మొగాన కళ చూడలేదు'అంది తరువాత ఆయనేమిటో మెల్లగా అన్నారు. అది మాత్రం సుమతికి వినిపించలేదు. కాని వినాలని సుమతి ఆశించింది. తరువాత ఆ అక్కగారి కంఠం పెద్దదికాలేదు. వెంటనే సుమతి మనసు, 'మాష్టరుగారుఎంతమంచివారో చూశావా సుమతీ. అంత మంచివారిని నీవిలా హింసించడం ఏం బాగుంది చెప్పూ' అంది. సుమతి దీర్ఘాలోచనలో మునిగిపోకముందే మాష్టరుగారి అక్క, 'వస్తా సుమతీ...వాణ్ణి ఇక నువ్వే కనిపెడుతూ వుండాలి. వాడి దసలే బేల గుండె. ప్రతిదానికి ఏమిటో అలా పిచ్చిగా కుమిలిపోతాడు. మరి వస్తాను' అంటూ ఆమె సాగిపోయింది. సుమతి కీ ఎదలో, ఎవ్వరో 'అయ్యో ఈ మాష్టరుగారు నీపట్ల దుర్మార్గంగా ప్రవర్తించి ఉంటే నీకింత ఇబ్బంది ఉండకపోనేమో...అప్పుడీ అవస్థ ఉండకపోయేది' అని వాపోయారు. మళ్ళీ 'కాని...ఇక నువ్వు మాష్టరుగారిని ప్రేమించడమే మంచిది సుమతీ...సూర్యం ఇంకెలాగూ నీవాడు కాదు. నువ్వెంతగా సూర్యంకోసం ఇక్కడ కూర్చొని ఇలా జపిస్తూ ఉన్నా, పరాయి స్త్రీవైన నిన్ను సూర్యం, ఇక ఎప్పటికీ తన వస్తువుగా చూసుకోలేడు. ఒకవేళ అతను నిన్ను దగ్గఱకు చేర్చుకోగలిగినా, నీవు అతనికి దగ్గఱగా పోలేవు. నీవు లోకానికి పూర్తిగా జడిసిపోయావు. నువ్వు లోకంకోసం బ్రతికే సుమతివి. కాని సూర్యం కోసంకాదు. సూర్యంకూడా అంతే. ఇది మీరు మొదట చేసిన తప్పు. ఇప్పుడు మీ రా తప్పును ఎట్లాగూ దిద్దుకోలేరు. అందుకు మీకు ఏమాత్రం సమర్థత లేదు. ఇది తెలిసికూడ ఇప్పుడు ఇంకో

తప్పు ఎందుకు చెయ్యబోతున్నావు సుమతీ... నేను నీకో సలహా ఇచ్చేదేమిటంటే ఇక నువ్వు మాష్టరుగారిని సుఖపెట్టాలని; అనవసరమైన ఆలోచనల్ని ఇంతటితో కట్టిపెట్టాలని.' పాపం సుమతి రెండుకాళ్ళమీద తలపెట్టుకొని, తలను రెండు చేతులతోనూ పట్టుకొని అలాగే ఉండిపోయింది.

ఆ వేళ ఆదివారం. సుమతి డాబామీద కందు లెండబోసింది. వాటిని చేతితో అటూ ఇటూ సర్దింది. డాబామీంచి ఆకసంవైపు ఒకసారి చూసింది. ఒక్క కాకికూడ కనిపించలేదు. విసుగ్గా డాబా అంచుకు నడచి వచ్చింది. భూమ్మీద జనం ఎవ్వరూ తిరుగుతూన్నట్లే లేదు. బహు తీవ్రంగా మండుకపోతూన్న ఎండను ఇంకో సారిచూసి, ఎంతో మెల్లగా మెట్లుదిగి తన గది లోనికిమాత్రం గబగబా పారిపోయింది. ఆ గది కిటికీలోంచి దొడ్లోని పూలమొక్కల వైపు ఒక సారి చూసింది. పాపమవి వడిలిపోయి కుమిలి పోతూన్నట్లు కనిపించాయి. సుమతి వాటివైపు మరొకసారి చూసింది. ఆమె ఈ లోకాన్ని మఱచి పోయింది. ఆమె కన్నులలో ఎంతోమంది ముసలి తలిదండ్రులు ఒక్కసారి మూలుగుతూ సాగిపోయారు. ఎవరో చాలామంది యువకులు, పలు రకాల విచిత్రవేషాల సొగసు బొమ్మల్లా అక్కడకు విచ్చేశారు. ఒక్కొక్కవధువునూ అనేకమంది తనిఖీ చేశారు. అందరూ పెదవి విరిచారు. ఇంతలో ఎవ్వరో రూపంలేని కాముకులొచ్చారు. పెళ్ళి కూతుళ్ళైన ఆ పిల్లలు కళ్ళుమూసుకున్నారు. పెళ్ళి అయిపోయిందనిపించుకున్నారు. కాపురాల్ని వెలగ బెట్టారు. పిల్లల్ని కన్నారు. వడలిపోయి విషాదంగా వికృతంగా భూమిమీదకు రాలిపోయారు.

సుమతి అలాగే చూస్తూ ఉండిపోయింది. ఆమె మెదడు కాస్సేపు స్తంభించి పోయింది. సుమతి ఎదలో ఎవరో, 'వీళ్ళంతా బలహీనులు, బలహీనులు' అని పెద్దగా అఱచారు. 'వాళ్ళకు ప్రేమలేదు. వాళ్ళప్రేమకు అర్థంలేదు. అర్థంలేక వాళ్ళకు ప్రేమలేదు. వాళ్ళు పేదలు. నిరుపేదలు. పేదలకు ప్రేమ ఏమిటి? చాలా బాగుంది సుమతీ ఈ బలహీనులకు వలపు విలువ లోకటా... ఇది చాలా బాగుంది' అని వికృతాట్టహాసం చేశారు. సుమతి చలించలేదు. ఈ ప్రపంచంలోని బాధలన్నీ స్త్రీలకోసమే అవతరించినట్లు, స్త్రీలను హింసించడానికే కాచుకొని కూర్చున్నట్లు భావించింది.

ఇంతలో ఆమె తలలోనికి మాష్టరుగారు మెల్లగా ప్రవేశించారు. వారిని గురించి ఆమె మనస్సు. 'సుమతీ...మాష్టరుగారు నిన్నేమి వంచించారు? ఆయన నీకేమి ఇక్కట్టులు తగిలించాడు. ఆయన కన్నులుచూడు. ఎంత విషాదాన్ని ఎంత బాధను దాచుకొని ఉన్నారయో...ఆయన దిన దినం నీకు జరిగిన అన్యాయానికే పాపం కుమిలి పోతున్నాడు. ఇది జరిగిపోయిన దానికి ఆయన అనుభవిస్తూన్న శిక్ష. ఈ శిక్ష నింకెందుకు సుమతీ పొడిగించు కోవటం? జరిగినదానికి విచారిస్తూ ఇలా హరించిపోయేకన్నా, ఉన్న ఈ కాస్తనూ మీ అభిమతాల కనుగుణమైన కొద్ది మార్పులతో స్వర్గానికి చేరువగా ఎందుకు మలచుకోరాదూ? ఆలోచించు సుమతీ... అతనా మంచివాడు. అసలే బేల గుండె వాడు. పాపం ఎందుకనో అలాపిచ్చిగా కుమిలిపోతున్నాడు. మరి నీవో సాక్షాత్తూ ఆయన అర్ధాంగివి. అతని కష్టసుఖాలను పంచుకోవలసిన దానివి. ఈ సదవకాశాన్ని జార విడుచుకొని నీ జీవితాన్ని నీళ్ళపాల్లు చెయ్యడం ఏం బాగుంది? నీ ప్రేమను వృధాపుచ్చకు. దాని లోని విశాల దృక్పథానికి అవరోధాలు కల్పించకు మాష్టరుగార్ని ప్రేమించు. ప్రేమించి సుఖించు. అంతకన్నా భారత నారికి ఈ లోకంలో కావల సిందేముంది సుమతీ...'

సుమతి ఈ లోకంలోనికి పూర్తిగావచ్చేప్పటికి ఆమెకు చుట్టూ ఏమీ కనిపించలేదు చిట్టచీకటి ఆమెను ముట్టడించింది. కారుమబ్బులు ఆకసాన ఎప్పుడలముకున్నాయో తెలియదు. చల్లనిగాలి వీచడమే తడవుగా హోరున వర్షంకురిసేట్లుగా ఉంది. అయితే ఆ మిత్రుని కోసమే ఎదురు చూస్తున్నాయి కాబోలు మబ్బులు! ఎదలోని బాధలను చెప్పుకొని తేలికపడాలని ఆ ప్రాణసఖుని రాకకై, విషాదగాథల నలుపెక్కిన మొగాలతో ఆకసాన గుండె బరువెక్కి చలనరహితంగా ఉండి పోయాయి. ఆప్తమిత్రుడువచ్చి గాఢంగా కౌగి లించుకోగానే అవి రాల్చిన అశ్రువులు ఎంతటి వ్యథాపూరితములు!

వానచినుకుల్ని చూడగానే సుమతికి కందుల మాట జ్ఞాపకానికి వచ్చింది. 'అయ్యో సుమతీ డాబామీద కందులు, ఇంత పరాకేమిటి. ఊఁ పరుగెత్తు. తడిసిపోతాయి ఊఁ పరుగెత్తు..' అంది ఆమె మనసు. సుమతి డాబాపైకి గబగబా వెళ్ళింది. 'అయ్యో ఇదేమిటి! మాష్టరుగారున్నారే ఇక్కడ! చేటతో వాటిని బుట్టలో ఎత్తి పోస్తున్నారే.. అయ్యో తనేమి చెయ్యాలి. ఇక్కడ ఇప్పుడు తనేమిచెయ్యాలి, వర్షంపడుతూంది. ఇది ఇప్పుడే ముంచుకు రావాలీ. అయ్యో ఒక్కరి వల్లగాదే, ఆ రే. ఇదేమిటి వాటిని తనూ చేతులతో ఎత్తి పోస్తూందేమిటి!. నేను తెస్తాను, అక్కర్లే ఫరవాలేదు. కాదు నేను, నేను తెస్తానండి. అరే, బుట్ట ఇంట్లోకి ఎలావచ్చేసింది. అబ్బ, కొద్దిగానే తడిశాయి నయమే. అబ్బబ్బ వర్షం. హోరున వర్షం, ఇదేం వర్షం. ఎప్పుడూ లేదు. ఈ పట్నంలోని మబ్బులన్నీ ఈ ఇంటిపైన చేర్చి ఒక్కసారి వాటిలోంచి నీరు వదిలినట్లే ఉంది. ఇదేం వర్షం కిటికీలోంచి వచ్చేస్తూంది.. కిటికీలు మూసెయ్యనా. అయ్యో మూసెయ్యకపోతే ఎలా అబ్బబ్బ చీకటి, అబ్బ! ఎంత చీకటిగా ఉందో. స్విచ్ వేస్తేనో, అప్పుడు దీపం వెలిగించకపోతే ఏమీ కనిపించేట్టులేదు. ఎక్కడుంది స్విచ్చి? అక్కడున్న, ఇక్కడేగా అయ్యో ఇదేమిటి...ఇక్కడ మాష్టరుగారి చేయి! ఇద్దరమూ ఒకేసారి ఒకే స్విచ్చి నొక్కామా?

సుమతి అంత సమీపంలో మాష్టరుగారిని చూడగానే శిలా ప్రతిమవలె కదలక మెదలక అక్కడే అలా ఉండిపోయింది. ఆమె కన్నులలో నీరు నిండింది. 'నే నిక మిమ్మల్ని విడిచి ఉండ లేను. మీరిక నాకు దూరంగా ఉండకండి' అన్న భావ మామె మొగంలో మహాద్భుతంగా మెరిసింది. ఆమె గుండెల్లోంచి ఉవ్వెత్తుగా ఉబికి వస్తూన్న దుఃఖం ఆమెలోంచి బహిరతమై పసిపిల్లలా, వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె మాష్టరుగారి భుజస్కంధాలపై కన్నీటి వెల్లువలతో సోలిపోయింది.

మాష్టరుగారు కదలలేదు. ఆయన గొంతుక ఒక విధాన పెగిలిరాలేదు. ఆయన అతి కష్టం మీద సుమతికి దూరంగా తొలగి, 'సుమతీ నన్ను ఇంక మరి కొన్నాళ్ళు క్షమించు సుమతీ, నిన్ను తప్పక ప్రేమించగలను' అని ఆయన ఇంకా ఏదో అనడానికి పెదవి విప్పబోతున్నాడు. సుమతి నిలువునా కూలిపోయింది. కుప్పగా, బాధల ముద్దగా, భరించనలవికాని తుపాకి దెబ్బకు కూలిపోయిన చిన్నారి పులుగు కన్నులా—కూలిపోయింది. మాష్టరుగారు భయంకరంగా, ఒక్కసారి 'సుమతీ' అన్నారు అంతే. శబ్దాలను మోసుకు వచ్చే గాలి మరి ఆ ఇంట్లోంచి బయటకురాలేదు.



న్యూయార్కులో, పి. జి. కృష్ణయ్యగారితో దేశ్‌ముఖ్ దంపతులు.